క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



కాగాన ప్రకాశ్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతాని కి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణానికి చెందిన కాగాన ప్రకాశ్‌ను రాష్ట్రస్థాయి వైఎస్సార్‌సీపీ కార్యదర్శిగా నియమించినందున ఆయనను మాజీ ఎమ్మెల్యే జోగారావు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి మరింత చురుగ్గా పని చేయాలని, అందరినీ కలుపుకుని పార్టీ భవిష్యత్ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలపడేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, నాయకులు మాతరమణ, ఎన్ ప్రసాద్, ఎస్.ఉమ, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గ గుడి ప్రతిష్ట

సీతానగరం:మండలంలోని నీలకంఠాపురంలో గ్రామస్తులు నిర్మించుకున్న కనకదుర్గమ్మ గుడి ప్రతిష్ట ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామస్తులంతా పూజా సామగ్రి, మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఆర్ గోపాలరావు, పార్వతమ్మ కుటుంబసభ్యులు మాట్లాడుతూ కనకదుర్గ గుడి నిర్మాణం పూర్తి కావడంతో ప్రతిష్ట ఉత్సవాలు జరిగాయని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ అన్నసంతర్పణ నిర్వహించామన్నారు.

ఈదురుగాలితో రూ2.25 లక్షల ఆస్తినష్టం

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట, బూర్జ ఏపీఈపీడీఎల్ సబ్ స్టేషన్ల పరిధిలో ఇటీవల వచ్చి తుపానుగాలికి విద్యుత్ శాఖకు చెందిన రూ 2.25 లక్షల విలువైన ఆస్తులకు నష్టం వాటిల్లినట్లు ఏఈ శశిభూషణరావు తెలిపారు. మండలకేంద్రంలో చెట్లు, కొమ్మలు వైర్లపై పడిపోవడంతో 26 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయన్నారు. అలాగే వైర్లు తెగిపోవడం, ఇన్సులేటర్లు పేలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం వంటి రూపాల్లో విద్యుత్ శాఖకు ఆస్తినష్టం వాటిల్లిందని తెలియజేశారు. ఇప్పటికే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక తయారు చేసి పంపించినట్లు తెలిపారు.

నారుమళ్ల చదునులో రైతులు నిమగ్నం



గెడ్డలుప్పిలో వరినారు మడికి దుక్కి చేస్తున్న రైతు

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేయడానికి మండలంలోని రైతులు వరినారు మళ్ల తయారీకి మట్టి దుక్కుల పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ వరిసాగు చేయడానికి వీలుగా రైతులు వరియదలు, మొక్క, డ్రమ్ సీడర్, యంత్ర పరికరాలతో వరినాట్లు వేయనున్నారు. వరిఉభాలు చేయడానికి ముందుగా వరినారు వేయడానికి ఆకు మడి తయారు చేస్తున్నారు. అలాగే కొంతమంది రైతులు వరియదలు వేయడానికి వీలుగా మట్టి నమూనాలు సేకరిస్తున్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా..?



రహదారి భద్రతా నియమాలకు విరుద్ధంగా వెళ్తున్న ఆటో

పార్వతీపురంటౌన్: ఓ పక్క ట్రాఫిక్ పోలీసులు, మరోపక్క రవాణాశాఖ సిబ్బంది రహదారి భద్రత నియామవళిపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు వాటిని పట్టించుకోవడం లేదు. ఆదివారం పార్వతీపురం పట్టణంలో రహదారి భద్రత నియమావళికి విరుద్ధంగా ఆటోలో నిర్లక్ష్యంగా వెళ్తుండగా "సాక్షి"కి చిక్కిన దృశ్యం.

ఇలా అయితే ఎలా సారు..?



జగన్నాథపురం రహదారిలో రోడ్డుపైన వదిలేసిన కాలువ పూడికలు

పార్వతీపురం టౌన్: స్వచ్ఛ సుందర పార్వతీపురం దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఒక పక్క మున్సిపల్ అధికారులు కోరుతున్నారు. ఈ కార్యక్రమం కేవలం ఫొటోలకే పరిమితమైందని మరోవైపు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పార్వతీపురం పట్టణంలో జగన్నాథపురం వెళ్లే దారిలో కాలువల్లో తీసిన పూడికలను రోడ్డుపైనే వదిలేయడంతో దుర్గంధంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణ పరిశుభ్రతకు పెద్దపీట వేస్తామని చెప్పి ఇలా వదిలేయడంతో అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

అమ్మవారి గద్దె నిర్మాణానికి అడ్డంకులు..!

- బఫర్ జోన్ అని అడ్డుకున్న అధికారులు
- మండిపడుతున్న భక్తులు

సాలూరు:

దేవదాయ ధర్మాదాయ శాఖ భూములు, ఆస్తులు, ప్రభుత్వ చెరువులు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు, అమ్మవారి గద్దె నిర్మాణం విషయంలో అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం వివరాల్లోకి వెళ్తే.. సాలూరు మున్సిపాలిటీలోని ఒరియాపండా వీధిలో రాణివారి కోనేరు దగ్గర 5 తరాల నుంచి ముత్యాలమ్మ గద్దె ఉంది. ఇక్కడ ఉన్న పెద్ద వేప చెట్టు వద్ద భక్తులు గతంలో మొక్కులు చెల్లించుకోగా అది సుమారు ఆరు నెలల క్రితం పడిపోయింది. ఆ స్థానంలో మరో చెట్టుకు భక్తులు మొక్కులు చెల్లిస్తున్నారు. కాగా పట్టణంలో శ్యామలాంబ పండగ నేపథ్యంలో ఈ అమ్మవారి గద్దె చుట్టూ పిట్టగోడ నిర్మించి గేటు ఏర్పాటు చేయాలని స్థానికంగా పలువురు భక్తులు భావించారు. ఇందుకోసం 2010లో శ్యామలాంబ పండగ కోసం వీధిలో ఎత్తుకున్న చందాల్లో మిగిలిన డబ్బులతో ఈ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గద్దె మధ్యలో చెట్టు ఉండడంతో కేవలం చుట్టూ గోడ కట్టి గేటు ఏర్పాటు తప్ప శ్లాబ్ వేసే ఉద్దేశం లేదని భక్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో గద్దె పనులు ప్రారంభించగా, ఇది బఫర్ జోన్‌లో ఉందంటూ అధికారులు పనులను అడ్డగించి నిలిపివేయించారు. గడిచిన 5 తరాలుగా తాము కొలుస్తున్న అమ్మవారి గద్దె పనులను నిలిపివేయడం సరికాదని, ఈ ప్రాంతంతో పాటు మున్సిపాలిటీలో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఎందుకు అధికారులు నిలుపుదల చేయలేక పోతున్నారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పెద్దలు స్పందించి ఈ గద్దె నిర్మాణం చేయించాలని కోరుతున్నారు.



అమ్మవారి గద్దె పిల్లర్‌కు వైర్‌ను కలిపి ఉన్న దృశ్యం



అమ్మవారి గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు (ఫైల్)



కోనేరు గట్టు వద్ద ముత్యాలమ్మ అమ్మవారి గద్దె నిర్మాణానికి అధికారులు నిలుపుదల చేయించారని చూపుతున్న భక్తుడు

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

కాగా ఇదే గద్దె వెనుక చెరువు గట్టు వద్ద విద్యుత్ స్తంభం పడిపోగా, దాని స్థానంలో నూతన స్తంభం వేయకుండా అక్కడ ఉన్న అమ్మవారి గద్దె పిల్లర్‌కు వైరును కలిపి, విద్యుత్ లైటును ఏర్పాటుచేశారని స్థానికులు చెబుతూ ఇది విద్యుత్‌శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు. ఇక్కడ పలువురికి విద్యుత్ షాక్ కొట్టినట్లు స్థానికులు గుర్తు చేస్తున్నారు.

గుక్కెడు నీటికోసం..!



ఊట నీటిని బిందెల్లోకి సేకరిస్తున్న గిరిజన మహిళలు

- లోయలు, గుట్టలు దాటి ఊటనీరు సేకరణ
- గ్రామాల్లో తాగునీటి సమస్యలున్నా పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తంచేస్తున్న గిరిజన మహిళలు

సాలూరు: తాగునీటి కోసం గిరిజన ప్రాంతాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లోని వాటర్‌ట్యాంకులు పాడైపోవడంతో సమీప వాగుల్లో ఊటనీరే వారికి ఆధారమవుతోంది. ఆ నీటి కోసం లోయలు, గుట్టలు దాటుతూ చిన్నపిల్లలను ఓ వైపు..మరో వైపు నీటి బిందెలతో ప్రయాణిస్తూ వారు పడుతున్న కష్టం వర్ణనాతీతంగా ఉంది. పాచిపెంట మండలంలోని బొర్రమామిడి పంచా యతీ పూతికవలస తదితర గ్రామాల గిరిజనులు తాగునీటికి కోసం సుమారు కిలోమీటర్ మేర గిరి శిఖర ప్రాంతానికి నడుచుకుంటూ వెళ్లి అక్కడ ఊ టనీటిని సేకరిస్తున్నారు. అనేక మలినాలతో మురికిగా నీరు ఉన్నప్పటికీ ఆ నీరే వారికి ఆధారంగా మారింది. వేసవి కాలంలో నీరు ఉండక, గ్రామంలో నీళ్ల ట్యాంకు గడిచిన 5 నెలలుగా పనిచేయడం లేద ని గ్రామస్తులు సీతమ్మ, రాములమ్మ, అంకమ్మ తది తరులు వాపోతున్నారు. చేసేది లేక కొండలు, గుట్ట లు, లోయలు దాటుతూ ఊటనీటిని తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. చిన్నపిల్లల్ని ఇంటి వద్ద విడిచిపెట్టలేక.. లోయల్లో తమ వెంట తీసుకువస్తూ ఓ వైపు పిల్లలు మరోవైపు నీళ్ల బిందెలు మోసుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు. దీనిపై సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ, వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కోరారు. ముఖ్యంగా ఏజెన్సీ గిరిశిఖర ప్రాంతాల్లో తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.



నీటి బిందెలతో లోయలు దాటుతూ గ్రామానికి వెళ్తున్న గిరిజన మహిళలు

కౌలు రైతు పత్రాలకు అర్జీ చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల ద్వారా వీఆర్వో లాగిన్‌లో అప్‌లోడ్ చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ జిరాయితీ భూములున్న రైతుల నుంచి భూములను కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న వాటికి సంబంధించిన కౌలు రైతులు 2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వ్యవసాయ సహాయకుల ద్వారా వీఆర్వో లాగిన్‌లో అప్‌లోడ్ చేయించుకున్న వారందరికీ సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. కౌలు రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు జగదీశ్వరరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా మిశ్రో

సీతంపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బీబీ మిశ్రోను నియమించారు. పొందూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తూ ఇక్కడకు ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వస్తున్నారు.

సాగునీరు అందించాలి..

పాలకొండ: తోటపల్లి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘ నాయకుడు ఎం. కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తోటపల్లి ఎడమ కాలువ పరిధిలోని శివారు గ్రామాలకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. సాగునీరు అందించాలని కోరుతూ బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాలువలకు మరమ్మతులు చేయించాలని పలుమార్లు కోరినా ఫలితం లేకపోయిందని వాపోయారు. రైతులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలి

- తహసీల్దార్ వై.జయలక్ష్మి

పార్వతీపురం రూరల్: సొంత ఇంటి నిర్మాణం నిమిత్తం ఇదివరకు ఇంటి స్థలం లేని వారు నేరుగా వారి సచివాలయం పరిధిలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ లాగిన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పార్వతీపురం తహసీల్దార్ వై జయలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆదివారం మాట్లాడుతూ ఇదివరకు ఎక్కడా ఇల్లు, స్థలం లేని వారు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

లబ్ధిదారులకు అనర్హతలు

దరఖాస్తు చేసుకునే వారి పేరుతో కానీ కుటుంబ సభ్యులలోని వ్యక్తుల పేర్లతో ఇల్లు ఉండకూడదు. అలాగే 10 ఎకరాల భూమిని కలిగి ఉన్న వారు అనర్హులు. ఏడాదికి రూ.1.20లక్షల కంటే తక్కువ తలసరి ఆదాయం ఉండాలి. ఆదాయపు పన్ను చెల్లింపుదారులై ఉండకూడదు. నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండరాదు. ఇదివరకే లబ్ధిదారులకు రేషన్ కార్డుపై ప్రభుత్వం ద్వారా ఇంటి పట్టా గాని, ఇల్లు గాని పొంది ఉండరాదని ప్రభుత్వ నిబంధనలను తహసీల్దార్ స్పష్టం చేశారు. అర్హులైన వారిని గుర్తించి గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలాలను అందజేయనున్నట్లు చెప్పారు.

నోరు మూసుకుని సీహెచ్‌ఓల నిరసన



కలెక్టరేట్ వద్ద వినూత్న నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

- మంత్రి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్

పార్వతీపురంటౌన్: సీహెచ్‌ఓలపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సందీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ వద్ద నోరు మూసుకుని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లపై మంత్రి జులుం ప్రదర్శించడం సరైన విధానం కాదని మండిపడ్డారు. మీ బాధలు వినడం మా పని కాదంటూ మంత్రి చెప్పడం బాధ్యతా రాహిత్యమన్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎంలతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని డిమాండ్ చేశారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు తక్షణమే చెల్లించి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా పితృత్వ సేవలు మొదలైనవి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జగదీష్, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు లేక అవస్థలు

- ఆంధ్రాలో కలపాలని రేవటిగుడ గ్రామస్తుల విజ్ఞప్తి

పార్వతీపురం రూరల్:

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు భూ భాగంలో ఆంధ్రలోని పార్వతీపురం మన్యం జిల్లా పెదమరికి పంచాయతీ సమీపంలో ఉన్న రేవటిగుడ గిరిజన గ్రామాన్ని ఆంధ్రలో ఉన్న పెదమరికి పంచాయతీలో కలిపి గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఈ మేరకు పలుమార్లు సీపీఎం ఆధ్వర్యంలో నిరసనల ద్వారా గ్రామస్తులు విన్నవించినా అధికారుల స్పందన కరువైందని సీపీఎం నాయకుడు పి.రాము పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన రేవటిగుడ గ్రామాన్ని సందర్శించి అక్కడ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఇటీవల కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు గ్రామస్తుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కనీసస్థాయిలో మౌలికసదుపాయాలు లేక రేవటిగుడ గిరిజన గ్రామస్తులు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు.

తప్పని డోలీ మోతలు

ఇటీవల రహదారి సౌకర్యం లేక గ్రామానికి చెందిన ఓ గిరిజన మహిళ పురిటి నొప్పులు రావడంతో డోలీకట్టి ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలో మార్గ మధ్యంలో అడవి మధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. వైద్యసేవల కోసం ఎటువైపు తీసుకెళ్లాలో తెలియని దీనస్థితిలో రేవిటిగూడ గ్రామ గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సీపీఎం నాయకుడు రాము తెలిపారు. తమ గ్రామానికి చందలంగి గ్రామం నుంచి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నట్లు తెలిపారు. రేవటిగుడ గ్రామంలో మౌలిక సదుపాయాలు లేక రోగాల బారిన పడిన గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గర్భిణుల కోసం ఏఎన్ఎం, ఆశ వర్కర్, సిబ్బంది లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



రేవటిగుడ గ్రామానికి చెందిన గర్భిణిని డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)



రోడ్డు సౌకర్యం లేక బురదలో రాకపోకలు సాగిస్తున్న రేవటిగుడ గ్రామస్తులు

అధికారులు స్పందించాలి

తక్షణమే మన్యం జిల్లా అధికారులు స్పందించి రేవటిగుడ గ్రామాన్ని పెదమరికి పంచాయతీలో కలపాలి. రెండు వందల కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేయాలి. తాగునీరు, రోడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– సీపీఎం నాయకుడు పి.రాము



సీతారాంపురం వద్ద డెబ్రిస్‌తో గోతులు పూడ్చిన బీటీ రోడ్డు



చెరువును తలపిస్తున్న బీటీరోడ్డు



కోతకు గురైన రోడ్డు



కృష్ణారాయపురం సమీపంలో ప్రమాదకరంగా బీటీరోడ్డు మలుపు

గోతులమయమైన బీటీ రోడ్లు

- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు

సీతానగరం: మండలంలో నిరంతరం వాహనాలతో ప్రయాణికులు తిరుగాడే బీటీ రోడ్లు గోతులమయం కావడంతో అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చిన్నారాయుడుపేట జంక్షన్ నుంచి రేపటివలస, కొత్తవలస, పార్వతీపురం మండలం పులిగుమ్మి, బందలుప్పి, జమదాల, వీరభద్రపురం, డి.శిర్లాం గ్రామాల రహదారిపై గోతులు ఏర్పడడంతో చెరువును తలపించే విధంగా తయారైంది. అలాగే తరచూ ప్రమాదాలు జరుగుతున్న రహదారిని అభివృద్ధి చేస్తామని పల్లెపండుగలో హామీ ఇచ్చి 8 నెలలు కావస్తున్నా ఇంతవరకూ పట్టించుకోలేదు. పులిగుమ్మి సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న గొయ్యిలో ట్రాక్టర్ డ్రైవర్లు డెబ్రిస్ వేస్ట్‌తో పూడ్చారు. పెదంకలాం- కృష్ణారాయపురం గ్రామాల మధ్య ఉన్న మలుపువద్ద బీటీరోడ్డు కోతకు గురైంది. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి రహదారులను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలో ఉన్న వారితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది శిబిరానికి వచ్చి, ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. మొత్తం 21 మంది వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ ఇళ్లకు మోక్షం

సీతంపేట: పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా పీవీటీజీలకు (పర్టికులర్లీ వానర్‌బుల్ ట్రైబ్ గ్రూప్) కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు మోక్షం లభించనుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే 2024 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 1232 ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగా... పునాదుల స్థాయిలో కొన్ని, శ్లాబు స్థాయిలో మరికొన్నిఉండగా. 29 గృహాలు పూర్తయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.33 లక్షలు మంజూరు చేస్తోందని హౌసింగ్ ఏఈ వెంకటేష్ తెలిపారు. నిర్మాణాలు చేపడుతున్న వారికి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు.



ఎర్రన్నగూడలో నిర్మాణంలో ఉన్న గృహాలు

నేటి నుంచి నీలమ్మ-నూకాలమ్మ గ్రామదేవత పండగ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేటలో నీలమ్మ-నూకాలమ్మ గ్రామదేవత పండగ సోమవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఆర్ఎస్ స్రవంతి, ఉత్సవ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. దైవదర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలో సోమవారం సాయంత్రం 3 గంటలకు అమ్మవారి(పాదాలు)ని తెచ్చుకోవడం జరుగుతుందని, ఆ తర్వాత ప్రతి రోజూ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, ఘటాల ఊరేగింపు వంటివి చేపట్టడం జరుగుతుందన్నారు.



విద్యుత్ అలంకరణలో నీలమ్మ గుడి